క్లుప్తంగా

ప్రతి ఒక్కరు ఓటు వేయాలి



మాట్లాడుతున్న బియ్యంకార్ శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: ఓటు హక్కున్న ప్రతి పౌరుడు ఖచ్చితంగా ఓట్లేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ కోరారు. ఈమేరకు సమితి ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. నోటుకు ఓట్లు అమ్ముకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థ కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నూరుశాతం ఓటింగ్ జరగాలని ప్రతి ఒక్కరు ఓటేయాలని కోరుతూ సమితి తీర్మానించింది. గజభీంకార్ మల్లాజి, వేముల సత్యనారాయణ, కుసుమ గణేశ్, చిప్ప దేవదాసు, దొంతుల ప్రతాప్, బోగ వెంకటేశం, భుజంకార్ సందీప్ పాల్గొన్నారు.

పోల్ చిట్టీల పంపిణీ



బోయినపల్లి: మండల కేంద్రంలో పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజ సులోచన బుధవారం తెలిపారు. గ్రామంలోని నలుగురు బీఎల్‌వోలు వారి వారి పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సాయం

తంగళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి బీటీఆర్ ఫౌండేషన్ ద్వారా బెంద్రం తిరుపతిరెడ్డి రూ.10 వేల వస్తువులతోపాటు టేకు మంచాలను వితరణ చేశారు.

చిత్రకథ



బస్టాండులో కుప్పలు.. ఎన్నాళ్లీ తిప్పలు

సిరిసిల్లటౌన్: కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడినట్లుంది ఆర్టీసీ అధికారుల తీరు. సిరిసిల్ల జిల్లా కేంద్రం కొత్త బస్టాండులో వర్షాకాలంలో రోడ్డంతా గుంతలు పడగా వాటిలో మట్టిని పోయించారు. బాగానే ఉంది కానీ.. కుప్పలను చదును చేయకుండా వదిలేయడంతో గుంతల స్థానంలో ఎత్తుగా ఉంటున్న మట్టికుప్పలతో బస్సు డ్రైవర్లు, ప్రయాణికులకు మూడు నెలలుగా తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అదుపు తప్పితే అంతే సంగతి

వేములవాడరూరల్: కోతకు గురైన ఈ రోడ్డును బాగుచేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతిరోజూ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. జగిత్యాల నుంచి శాత్రాజుపల్లి మీదుగా వేములవాడకు వస్తున్న ప్రధాన రోడ్డు కొన్ని నెలలుగా వర్షాలకు కోతకు గురైంది. ఈ రోడ్డు వెంట ప్రతిరోజూ వందలాది వాహనాలు వస్తుంటాయి. అయినప్పటికీ అధికారులు రోడ్డును బాగుచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మార్కండేయ ఆలయానికి వెండి శఠగోపం



వెండి శఠగోపం అందిస్తున్న దంపతులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీమార్కండేయ ఆలయానికి స్థానిక పుల్లూరి నాగలక్ష్మి–లక్ష్మీనారాయణ దంపతులు బుధవారం వెండి శఠగోపం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి శఠగోపం బహూకరించిన దంపతులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఉమాశంకర్, పద్మశాలీ సంఘం యూత్ అధ్యక్షుడు వనం రమేశ్, అంబదాస్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులు ధర్మప్రవర్తన కలిగి ఉండాలి

- శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక



ప్రవచిస్తున్న వేణుగోపాలచార్య కౌశిక

ఎల్లారెడ్డిపేట: భక్తులు ధర్మప్రవర్తన, భగవత్ చింతన కలిగిఉండాలని జగిత్యాలకు చెందిన శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక అన్నారు. మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో 63వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకోని శ్రీ మద్భాగవత సప్తాహాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచిస్తూ ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో పయనించాలని, భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. శ్రీసరస్వతీ గోవిందరాజులు స్థానికంగా శ్రీరామ నామంతో సత్సంగ సదనం స్థాపించి లిఖిత శ్రీరామకోటి స్థూపాన్ని నిర్మించి వేలాది మంది భక్తులను తయారు చేసిన మహనీయుడన్నారు. భక్తుల భగవన్నామస్మరణతో సత్సంగ సదనం మారుమోగింది. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి అక్మారెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

- అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు
- మండలంలో 70 మంది బైండోవర్



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నవత

వీర్నపల్లి: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో కంచర్ల, వీర్నపల్లి, రంగంపేట, గర్జనపల్లిలో పోలీస్, రెవెన్యూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ గ్రామాల్లో ఎస్సై నవత ఆధ్వర్యంలో ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు.

16 పోలింగ్ కేంద్రాలు

మండలంలో 17 గ్రామ పంచాయతీలుండగా, 16 పోలింగ్ కేంద్రాలు, 11,370 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 5,713 మంది మహిళలు, 5,657 మంది పురుషులు ఉన్నారు. తహసీల్దార్ ఉమారాణి బీఎల్‌వోలకు పలుమార్లు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు.

కేంద్ర బలగాలతో కవాతు

వీర్నపల్లి, రంగంపేట, కంచర్ల, గర్జనపల్లి, వన్‌పల్లి, శాంతినగర్, అడవిపదిర, మద్దిమల్ల, భూక్యతండా, బాబాయి చెరువు తండా, బాపుసింగ్ నాయక్ తండా గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. శాంతి భద్రతలపై అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 70 మంది బెల్ట్‌షాపు నిర్వహకులను, రౌడీ షీటర్లు ముగ్గురు, సమస్యాత్మక వ్యక్తులు నలుగురిని గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బెల్ట్‌షాపు నిర్వాహకులపైన ప్రత్యేక నిఘా పెట్టారు. బైండోవర్ అయిన వ్యక్తులు ఎన్నికల నియామవళి ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని సూచిస్తున్నారు. అలాగే ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఎలాంటి ఆటంకాలు కలిగించకుండా ప్రశాంతంగా ఓటు వేయాలన్నారు. మీ ప్రాంతాలు ఏ అవకతవకలు జరిగిన సీవిజిల్ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ఫిర్యాదు వచ్చిన వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, ఆస్తులను ధ్వంసం చేసినా, గొడవలు సృష్టించినా కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని, అందుకు గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని, సమస్యాత్మక గ్రామాలే లక్ష్యంగా కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని అన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీలో సీఐ కృష్ణకుమార్

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామంలో బుధవారం సాయంత్రం వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల గుర్తింపు పత్రాలు పరిశీలించారు. వాహనదారులు తమవెంట వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని కోరారు. ఎన్నికల సమయం కావడంతో ప్రతీ వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో నిర్మించబోయే శ్రీవిరాట్ విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్మించబోయే ఆలయానికి సర్పంచ్ గొడిశెల జితెందర్ రూ.5 వేలు విరాళం అందజేశారు.

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తా

- వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



రుద్రవరంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/కోనరావుపేట/చందుర్తి: మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలను పరిష్కారిస్తానని, అభివృద్ధి సంక్షేమాల్లో మాట తప్పను, మడమ తిప్పనని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం రుద్రవరం, అనుపురం, నాంపల్లి, కోనరావుపేట మండలం కనగర్తి, సుద్దాల, చందుర్తి మండలం బండపల్లి, కిష్టంపేట, రామరావుపల్లె, సనుగుల గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. మిడ్ మానేరు నిర్వాసితులకు ప్రభుత్వం సరైన నష్టపరిహారం ఇవ్వకపోగా వారిపై అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వారి పక్షాన కాంగ్రెస్ పార్టీ అలుపెరగని పోరాటం చేస్తున్నదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కనుకయ్య, ఎంపీటీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.

బిడ్డ.. ఈసారి నువ్వే గెలుస్తావు

వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో ప్రచారానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌ను 'బిడ్డా ఈసారి నువ్వే గెలుస్తావ్..' అంటూ బొమ్మ ముత్తవ్వ అనే వృద్ధురాలు ఆశీర్వదిస్తూ, రూ.2 వేల నగదును ఆయనకు అందించింది. దీంతో ఆయన ముత్తవ్వ కాళ్లు మొక్కి ఆశీర్వదం తీసుకున్నాడు.



ఆది శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ముత్తవ్వ

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ కౌన్సిలర్

వేములవాడ: వేములవాడలోని 17వ వార్డు కౌన్సిలర్ వంగల దివ్య–శ్రీనివాస్ దంపతులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

రాళ్లవాగు, సూరమ్మ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

- వేములవాడ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



మాట్లాడుతున్న వికాస్‌రావు

కథలాపూర్: రాళ్లవాగు, సూరమ్మ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశామలం చేస్తామని వేములవాడ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. బుధవారం కథలాపూర్ మండలంలోని 12 గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాటకు బీజేపీ కట్టుబడి ఉంటుందని, పసుపు బోర్డు తెచ్చి రైతుల్లో ఆనందం తెచ్చిన ఘనత మాదేనన్నారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాళ్లవాగు ప్రాజెక్టు కాలువల గురించి పట్టించుకోలేదని, కమీషన్లకు కక్కుర్తిపడి అవినీతిమయమైన పాలన అందించారని మండిపడ్డారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు ఎడ్మల వినోద్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు గంగాధర్, వెంకటేశ్వర్‌రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నమనేని విద్యాసాగర్‌రావు

మోదీ పాలనలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

చందుర్తి: దేశంలో మోదీ పాలన ప్రపంచ వ్యాప్తంగా దేశానికి మంచి గుర్తింపు తెచ్చిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ అన్ని కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాజకీయ నాయకులకు పదవులు శాశ్వతం కాదని, ప్రజలు ఇచ్చి ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేసి చూపెట్టాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అల్లాడి రమేశ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, సర్పంచ్ ప్రేమలత పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్

కోనరావుపేట: మండలం వట్టిమల్ల మాజీ సర్పంచ్ జెట్టి అంజయ్య బుధవారం బీజేపీలో చేరారు.

సిరిసిల్లలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

- డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి
- సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ



పోతుగల్‌లో మాట్లాడుతున్న రుద్రమదేవి

ముస్తాబాద్: బీఆర్ఎస్ కుటుంబపాలనకు ప్రజలు చరమగీతం పాడుతున్నారని, సిరిసిల్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేసి ప్రభుత్వాన్ని తీసుకురాబోతున్నామని ఆ పార్టీ సిరిసిల్ల అభ్యర్థి రాణి రుద్రమ అన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్, గన్నెవానిపల్లె, సేవాలాల్‌తండా, తెర్లుమద్ది, మొర్రాపూర్, బందనకల్, వెంకట్రావుపల్లె, మోహినికుంట, మద్దికుంట గ్రామాల్లో బుధవారం ఇంటింటా ప్రచారం చేపట్టి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ప్రజల బాగోగులు పట్టించుకోకుండా అందుబాటులోకి లేకుండా పోయాడన్నారు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. యువకులను మోసం చేసి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఊరురా పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు పెట్టిన కేటీఆర్‌కు కుటుంబాల ఉసురు తగులుతుందన్నారు. బెల్ట్ షాపులతో కుటుంబాలను దోచుకుంటూ రూ.కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రాగానే బెల్ట్ దుకాణాలను మూసివేస్తామన్నారు. అసెంబ్లీ ఇన్‌చార్జి కరెడ్ల మల్లారెడ్డి, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రావు, ప్రభాకర్‌రావు, సంతోష్‌రెడ్డి, కామిటికారి పద్మ, సంజీవ్, వరి వెంకటేశ్, అంజాగౌడ్, చిట్నేని శ్రీనివాస్‌రావు, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వారికే కార్మికుల ఓట్లు

- కార్మిక ప్రజాసంఘాల నాయకుడు అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

వీర్నపల్లి: కార్మికుల సమస్యలు పరిష్కరించే వారికే ఓట్లు వేస్తామని కార్మిక ప్రజాసంఘాల ప్రతినిధి మల్లారపు అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో కార్మిక ప్రజాసంఘాల నాయకులు ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశానికి బుధవారం కార్మిక ప్రజాసంఘాల నాయకులు జాలపల్లి మనోజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. మొదట ఇటీవలే అనారోగ్యంతో చనిపోయిన కార్మికులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో కార్మికుల బ్రతుకులు మారడం లేదని, రెక్కాడితే కానీ డొక్కాడని కార్మికుల జీవితాల్లో వెలుగులో నింపే వారే కరువయ్యారని, అదేవిధంగా మండల కేంద్రంలోని వెంకట్రాయిని చెరువులో భూములు కోల్పోయిన దళిత భూనిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో వేలాది మంది కార్మికులు కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ కార్మిక భవనం లేక ప్రతినెల చెట్ల కింద సమావేశాలు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో కార్మిక భవనం నిర్మాణం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి అండగా నిలబడిన వారికే కార్మికుల మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య, హమాలీ సంఘం మండల అధ్యక్షుడు అన్నారం రాజేశం, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు దేవయ్య, గ్రామపంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు పర్సయ్య, ఈ కార్యక్రమానికి దాదాపు 400 మందితో కార్మికులు హాజరయ్యారు.

బీఆర్ఎస్‌ను ఇంటికి పంపాలి

- కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి

మానకొండూర్/శంకరపట్నం: అక్రమాలకు పాల్పడుతూ రూ.కోట్లు దండుకున్న బీఆర్ఎస్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలంలోని కరీంపేట, ఇప్పలపల్లి, తాడికల్ గ్రామాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పథకాలు అమలు చేయకుంటే గల్లపట్టి అడగండని అన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, రూ.2,500, రూ.500 గ్యాస్ సిలిండర్ అందిస్తామని కాంగ్రెస్ గ్యారంటీలను బీఆర్ఎస్ కాపీ కొట్టిందని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ డబుల్ బెడ్‌రూమ్, దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, యువతకు నిరుద్యోగ భృతి అందించకుండా మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలన్నారు. పేదలకు భూములివ్వని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మాత్రం ఫామ్‌హౌజ్ వచ్చిందని ఆరోపించారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రసమయి బాలకిషన్‌ను చిత్తుగా ఓడించాలని కోరారు. ఈసమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బస్వయ్య, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ భైరి సంపత్, ఉపసర్పంచులు కుమార్, శ్రీనివాస్, మైనార్టీ జేఏసీ కన్వీనర్ రహీం, కోకన్వీనర్ ఆరీఫ్, సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, జిల్లా అధ్యక్షురాలు మల్లవ్వ, కవ్వంపల్లి అనురాధ, నాయకులు పాల్గొన్నారు. మానకొండూర్ మండలంలోని కొండపల్కల, మద్దికుంట గ్రామాల్లోని బీఆర్ఎస్, బీజేపీ నుంచి పలువురు నాయకులు కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మద్దికుంట మాజీ సర్పంచ్ దువ్వాసి భూపతి, ఉపసర్పంచ్ బుర్ర శ్రీధర్, వార్డు సభ్యులు మల్యాల శంకరయ్య, ఎల్కపల్లి నర్సయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కెక్కర్ల శ్రీనివాస్, కొండపల్కల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాడ తిరుపతిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కొత్తిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు సాయిలు, రాజయ్య, రెండు గ్రామాల నుంచి వంద మంది కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి కవ్వంపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న కవ్వంపల్లి

శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ నెల 22 నుంచి 27 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు ఆలయంలో వేద పండితులు ఉదయం 5 గంటలకు ఆలయ సంప్రోక్షణ, శుద్ధి పుణ్యాహవచనం, భగవతారాధన, తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం 5 గంటలకు ఆచార్య విజ్ఞాపనము, దివ్యప్రబంధ సేవాకాలం, నివేదన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్‌చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్, వేద పండితులు నవీన్‌చారి, గోపాల్‌చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పండ్లతో ఆరోగ్యం పదిలం

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఫ్రూట్ డే నిర్వహించారు. పండ్లతో కలిగే ఉపయోగాలను విద్యార్థులు ఆయా పండ్ల ఆకృతిలో ప్రదర్శించారు. రోజు పండ్లు తినడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.